క్లుప్తంగా

రూ.6.80కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సూరారం డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రూపురేఖలే మారిపోయాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం సూరారం డివిజన్ పరిధిలోని మార్కెండేయనగర్, నెహ్రూనగర్, బసవతారకం నగర్, సంజయ్‌గాంధీనగర్, రాజీవ్ గాంధీనగర్, వెంకటరామ్‌నగర్, విశ్వకర్మ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ.6.80 కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, కమిటీ హాళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ తదితరులు ఉన్నారు.

'ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది'



గద్దం రాజేందర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, హరీష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు బీజేపీలో తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన గద్దం రాజేందర్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా బుధవారం ఆయన్ని శ్రీశైలంగౌడ్, మేడ్చల్ జిల్లా అర్బన్ రూరల్ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డిలు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బస్తీల సమస్యలు పరిష్కరించడంలో విఫలం

జగద్గిరిగుట్ట: ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధులు బస్తీల సమస్యల పరిష్కరించడంలో విఫలమయ్యారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్‌లో స్థానికంగా నెలకొన్న సమస్యలపై బస్తీ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ... పేదల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానికంగా నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ప్రెసిడెంట్ లాల్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మార్టిన్‌కు బెస్ట్ ప్లేస్‌మెంట్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సెయింట్‌మార్టిన్ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల ఔట్‌స్టాండింగ్ ఇన్‌స్టిట్యూట్ విత్ బెస్ట్ ప్లేస్‌మెంట్స్ అవార్డుకు దక్కించుకుంది. బుధవారం వరల్డ్ సమిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం 100 శాతం విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ అందిస్తున్నామని అన్నారు. అవార్డు రావడం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ జైకిషన్‌యాదవ్, గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా తదితరులు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం



యేసుదాసు..

జీడిమెట్ల: బంధువుల ఇంటికి వచ్చిన ఓ వృద్ధుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా ముదినేపల్లికి చెందిన దొండబత్తిన యేసుదాసు(65) తన అల్లుడు పరశురాంతో కలిసి ఐడీఏ జీడిమెట్ల రాంరెడ్డినగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యేసుదాసు రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల బంధువుల ఇళ్లల్లో వాకబు చేసిన ఫలితం లేక పోయింది. బుధవారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ ఓటర్లు

6,69,253



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్లు 6,69,253 తేలింది. గడిచిన మూడు నెలలుగా కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు ఆధ్వర్యంలో కొత్త ఓటర్ల దరఖాస్తుల స్వీకరణ, రాజకీయ పార్టీలతో సమావేశాలు, ఎన్నికల సిబ్బందితో సమీక్షలు నిర్వహించి ఎట్టకేలకు పూర్తిస్థాయి జాబితాను వెల్లడించారు. గత నెల 21వ తేదీన విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో 3,35,307 మంది పురుషులు, 3,17,793 మహిళలు, 153 మంది ఇతరులు ఉన్నట్లు తుది జాబితా విడుదల చేశారు.



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నోటీసు బోర్డులో జాబితాను పెట్టిన అధికారులు

◆ అదేవిధంగా డ్రాఫ్ట్ రోల్ ద్వారా 14,943 పురుషులు, 14,713 మహిళలు, 25 మంది ఇతరులు కలిపి మొత్తం 29681 పెరిగినట్లు ఎన్నికల అధికారి పులి సైదులు పేర్కొన్నారు. మొత్తం 582 పోలింగ్ స్టేషన్లలో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు గిరిబాబు, సిబ్బందితో కలిసి తుది జాబితా గణాంకాలను నోటీసు బోర్డులో పెట్టారు.



నాకింకా లోకంతో పని ఏముంది | డేంట్ కేర్.!

పూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా పడుకొని హల్‌చల్ చేశాడు. బుధవారం జగద్గిరిగుట్ట–ఐడీపీఎల్ ప్రధాన రోడ్డులోని గాంధీనగర్ వద్ద ఓ వ్యక్తి అతిగా మద్యం సేవించి రోడ్డు మధ్యలో అడ్డంగా పడుకున్నాడు. దీంతో ఐడీపీఎల్‌కు వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానికులు మద్యం తాగిన వ్యక్తిని ఎత్తుకెళ్లి రోడ్డు పక్కకు పడుకోబెట్టడంతో ట్రాఫిక్ సమస్య సద్దుమణిగింది. – చింతల్

ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్ నమోదు షురూ



ఆన్‌లైన్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి

దుండిగల్: సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే దిశగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్‌లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్ ద్వారా ఒక్కొకక్కరికి రూ.5లక్షల వరకు ప్రైవేట్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర నిధులతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో విష్ణుశ్వర్, శ్యామ్‌రావు, మల్లేశ్ యాదవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనంపల్లి హన్మంతరావును బుధవారం టీపీసీసీ ప్రతినిధి కొలను హన్మంత్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలోకి మైనంపల్లి రావడం ద్వారా పార్టీ మరింతగా బలపడిందని తెలిపారు. తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్‌లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సుపరిపాలనే ధ్యేయం



సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: సుపరిపాలన అందించడమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను నివేదించారు. వీటిపై స్పందించిన శంభీపూర్‌రాజు సంబంధిత అధికారులతో ఫోన్లతో మాట్లాడి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ నిధులతో మూడు కమ్యూనిటీహాళ్ల నిర్మాణం



కమ్యూనిటీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి

జీడిమెట్ల: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అడిగింది లేదనకుండా చేస్తున్నారని సుభాష్‌నగర్ కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ నిధులతో కార్పొరేటర్ సుభాష్‌నగర్‌లోని మైత్రినగర్, కుమ్మరిబస్తీ, ప్రియాంక నగర్‌లలో ఎమ్మెల్సీ నిధులు రూ.30లక్షలతో మూడు కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇది వరకే ఆయా బస్తీల ప్రజలు కమ్యూనిటీహాల్‌ల నిర్మాణం కోసం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన తన నిధుల నుంచి రూ.30లక్షలు విడుదల చేశారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయడం పట్ల ఆయా బస్తీల ప్రజలు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, డివిజన్ నాయకులు, బస్తీల కమిటీ సభ్యులు, డివిజన్ ప్రధాన కార్యదర్శులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రొ. కాశీసాయి ప్రసాద్‌కు డాక్టరేట్



తమిళనాడు గవర్నర్ తిరు ఆర్‌ఎన్ రవి చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కాశీసాయి ప్రసాద్

దుండిగల్: ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో సీఎస్‌ఈ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొ. కాశీసాయి ప్రసాద్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో పట్టాను అందుకున్నారు. అన్నామలై యూనివర్సిటీలోని అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్. ఎస్ పశుపతి మార్గదర్శకత్వంలో కాశీసాయి ప్రసాద్ 'ఎఫిషియెంట్ బ్రెయిన్ స్ట్రోక్ డిటెక్షన్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎనేబుల్డ్ ఫ్రేమ్‌వర్క్'అనే పేరుతో పరిశోధన చేశారు. తమిళనాడు గవర్నర్ తిరు ఆర్‌ఎన్ రవి చేతుల మీదుగా పట్టాను పొందారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్‌ను ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మేయర్ నీలారెడ్డిని కలిసిన క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: కుల మతాలకు తావు లేకుండా అన్ని వర్గాల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌గా మర్యాదపూర్వకంగా కలిశారు. క్రిస్టియన్లకు శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలన్నారు. అదే విధంగా కమిటీ హాలు నిర్మాణానికి సహకరించాలని విన్నవించగా మేయర్ సానుకూలంగా స్పందించారు. కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్, క్రిస్టియన్ మైనార్టీ ప్రెసిడెంట్ జాషువా పుచ్చకాయల, యూసీడబ్ల్యూఏ క్రిస్టియన్ మైనారిటీ ప్రెసిడెంట్ రవి కుమార్, ఎస్‌పీపీఎఫ్ ప్రెసిడెంట్ జ్యోతి బాబు, ప్రధాన కార్యదర్శి సెక్రెటరీ సమ్యూల్, ప్రగతి నగర్ పాస్టర్స్ చంద్రశేఖర్, జెరేమియా తదితరులు ఉన్నారు.

ఎంఓసీ సీజన్-5 ఫైనల్స్‌కు నందిని దుగ్గి



నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ వీజేఐటీ కళాశాలలో బుధవారం మాస్టర్ ఆరేటర్ చాంపియన్‌షిప్ (ఎంఓసీ) సీజన్–5 సెమీఫైనల్స్ జరిగాయి. టోస్ట్‌మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ డిస్ట్రిక్ట్–126 సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిస్సా, మహారాష్ట్రలకు చెందిన 120 కళాశాలలకు చెందిన 1200మంది విద్యార్థుల పాల్గొన్నారు. మొత్తం 120 మంది విద్యార్థులు సెమీఫైనల్స్‌కు చేరగా వారిలో 10 మంది వీఎన్‌ఆర్ వీజేఐఈటీ విద్యార్థులు చేరుకోగా వారి నుంచి బీటెక్ ద్వితీయ సంవత్సర విద్యార్థిని నందిని దుగ్గి ఫైనల్స్‌కే చేరింది. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించిన డాక్టర్ సుధాదేవి మాట్లాడుతూ.. ఎంఓసీ సీజన్–5 ఫైనల్స్‌కు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ కళాశాల వేదిక కానుందన్నారు.

18వేల పుస్తకాలను పంపిణీ చేశాం



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

దుండిగల్: తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 18 వేలకు పైగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశామని కూన కృష్ణగౌడ్ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. డి.పోచంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కిట్లను అందజేస్తున్నామని అన్నారు. పేద విద్యార్థులను ఆదుకునే దిశగా తమ ట్రస్ట్ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్, కౌన్సిలర్ రాము గౌడ్, నాయకులు మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్ సాయి యాదవ్, నాయకులు సంతోష్, పాండు, నర్సింహా చారి, హర్ష, పుల్లారావు, ట్రస్ట్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ స్థలం ప్రభుత్వానిదే..

బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు



బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్

సుభాష్‌నగర్: గాజులరామారం–లాల్ సాహెబ్‌గూడ దారిని ఆనుకుని ఉన్న సర్వే నం.12లోని స్థలాన్ని ప్రభుత్వ భూమిగా తెలుపుతూ బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ బోర్డ్‌ను ఏర్పాటు చేశారు. కోట్లు విలువ చేసే ఈ స్థలంపై కన్నేసిన కొంతమంది పక్కనే ఆనుకుని ఉన్న 445 సర్వే నెంబర్‌గా పేర్కొంటూ సదరు స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నాలు జరిపారు. ఈ విషయమై 'సాక్షి'పలు మార్లు వెలుగులోకి తీసుకురావడం, అధికారులు బోర్డు ఏర్పాటు చేయడం, కబ్జారాయుల్లు తిరిగి ఆక్రమించడం పరపాటిగా మారింది. ఎట్టకేలకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ సదరు స్థలం ప్రభుత్వానికి చెందినదని పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. సదరు స్థలాన్ని ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాలుకు కేటాయించినట్లు ప్రకటించడంతో ఆ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు

నిజాంపేట్: తెలంగాణ ఆడబిడ్డలు ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలు అందిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా బతుకమ్మ చీరల పంపిణీని ప్రజాప్రతినిధులు చేపట్టారు. సూరారంలో చీరలు అందజేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ వేదికగా నిలుస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పూలపండుగ జరుపుకోవడం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకత అని అన్నారు.



సూరారంలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



చీరలు అందజేస్తున్న కొంపల్లి చైర్మన్ శ్రీశైలం యాదవ్



చీరలు అందజేస్తున్న మేయర్ కొలన్ నీలారెడ్డి



దుండిగల్‌లో చీరల పంపిణీ చేపట్టిన చైర్‌పర్సన్ కృష్ణవేణి



షాపూర్‌నగర్‌లో .. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ